ప్రజాశక్తి
శుక్రవారం 28 ఏప్రిల్ 2023 5
శ్రీ సత్యసాయి

జయమంగళి రీచ్ నుంచి టిప్పర్ల ద్వారా తరలిపోతున్న ఇసుక

నాడు లాగేసుకున్నారు.. నేడు పంచేశారు..!

బుధవారం నాడు జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రిని అడ్డుకునే ప్రయత్నం చేసిన నిర్వాసిత రైతులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం పరిధిలోని పోతులనాగేపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూములను తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో బలవంతంగా లాగేసుకుంటే... వైసిపి హయాంలో ఇళ్ల పట్టాల కోసం లే అవుట్‌లు వేసి పంచేశారు. ప్రభుత్వాల నిర్ణయాలతో తరతరాలుగా భూమిపై ఆధరపడి బతుకుతున్న ఈ రైతు కుటుంబాల బాధలు అరణ్యరోదనే అవుతున్నాయి.

నాడు ఏమి జరిగింది..!

ధర్మవరం పట్టణంలోని పేదలకు ఇళ్ల స్థలాల నిర్మాణం కోసమని పోతులనాగేపల్లి గ్రామం పరిధిలో 90 మంది రైతులకు సంబంధించి 210 ఎకరాల భూమిని 2018లో సేకరించాలని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్ణయించారు. పట్టణానికి ఆనుకుని ధర్మవరం-పుట్టపర్తి రహదారి సమీపంలో ఉండటంతో అక్కడి భూములకు విలువ ఎక్కువగా ఉంది. ప్రభుత్వం మొదట ఎకరానికి రూ.3.50 లక్షలు మాత్రమే పరిహారమిచ్చే విధంగా నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ రైతులు సిపిఎం, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఇంత తక్కువ మొత్తానికి ఇవ్వమని ఆందోళన చేయడంతో ఐదు లక్షల రూపాయలకు అధికారులు పెంచుతూ నిర్ణయం చేశారు. అయితే రైతులు అంగీకరించలేదు. భూసేకరణను అడ్డుకున్నారు. అయితే అప్పటి పాలకులు అధికారులతో కలిసి బలవంతంగా

రైతులకు అన్యాయమే జరిగింది... ఇప్పుడేమీ చేయలేం...

నాడు టిడిపి హాయాంలో రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చేశారు. ఐదు లక్షల రూపాయలు కోర్టులో డిపాజిట్ చేశారు. దీన్ని పెంచాలని నేను ఎమ్మెల్యే అయిన తరువాత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాను. కాని ఒకసారి పెంచితే రాష్ట్రంలో మరికొన్ని చోట్ల ఇటువంటి డిమాండ్లు వస్తాయని, పెంచలేమని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. గత పాలకులు చేసిన తప్పులకు పరిహారం విషయంలో రైతులకు అన్యాయం జరిగింది.

కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ధర్మవరం ఎమ్మెల్యే.

తుంపర్తి రైతుల అరణ్య రోదన

జెసిబిలతో పంటలను ధ్వంసం చేశారు. ఈ సమయంలో రైతులు పెద్దఎత్తున పోరాటానికి దిగారు. ఈ ఆందోళనకు అప్పటి ప్రతిపక్ష నాయకుడిగానున్న ఇప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కూడా మద్దతు తెలిపారు. మరోమారు అధికారులు చర్చలు జరిపి ఐదు లక్షలతోపాటు ఇళ్ల స్థలాలకు సేకరించిన భూమిలో నుంచి నాలుగు సెంట్ల నుంచి 20 సెంట్ల వరకు భూమిని నిర్వాసితులకు ఇస్తామని అప్పటి ఆర్డీవో లిఖితపూర్వకంగా హామీని సైతం ఇచ్చారు. ఇందుకు కొంత మంది రైతులు అంగీకరించారు. 38 మంది రైతులు ఈ పరిహారం అందుకున్నారు. తక్కిన వారు దీనికి కూడా అంగీకరించకుండా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ కేసు న్యాయస్థానంలో నడుస్తోంది. ఇదే సమయంలో వైసిపి అధికారంలోకి వచ్చాక ఈ భూములను జగనన్న లే అవుట్ కింద మార్చి పేదలకు పంపిణీ చేశారు. నిర్వాసితులకు మాత్రం పరిహారం అందలేదు. ఇస్తామన్న భూమినీ ఇంత వరకు ఇవ్వలేదు. ఈ ప్రాంతంలో ఎకరం మూడు కోట్ల వరకు విలువ ఉంటే తమకు ఐదు లక్షల రూపాయలు మాత్రమే ఇస్తే సరిపోదని, పెంచాలని కోరుతున్నారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని బుధవారం నాడు కాన్వయ్‌కు అడ్డంగా వెళ్లి వినతిపత్రం అందజేసే ప్రయత్నాన్ని నిర్వాసిత రైతులు చేశారు.

న్యాయమైన పరిహారం ఇవ్వాలి

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బలవంతంగా భూసేకరణ చేస్తుంటే, రైతులకు అండగా సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం చేశాం. ఐదు లక్షల పరిహారంతోపాటు, 20 సెంట్ల వరకు స్థలమిస్తామని అప్పటి ధర్మవరం ఆర్డీవో లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. కాని అమలు జరగలేదు. వాస్తవిక ధర ఎకరానికి అక్కడ మూడు కోట్ల వరకు ఉంది. ఇప్పుడు ఇచ్చే పరిహారం నామమాత్రంగా ఉందని రైతులు చెబుతున్నారు. పెంచి ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం పరిశీలించి పెంచి ఇవ్వాలి. అదే విధంగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలి. దీనిపై రైతులు చేసే పోరాటానికి తమ మద్దతు ఉంటుంది.

ఎం.ఇంతియాజ్, సిపిఎం జిల్లా కార్యదర్శి, సత్యసాయి జిల్లా.

నాటి అన్యాయంపైనా టిడిపి స్పందించాలి

రైతులు ముఖ్యమంత్రి కాన్వాయ్‌కు అడ్డుపడి తమ సమస్యను విన్నవించే ప్రయత్నం చేశారు. కాని ముఖ్యమంత్రి రైతుల సమస్యలను వినకుండానే వెళ్లిపోయారు. తాము కూడా ఈ రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నాం. అయితే టిడిపి హయాంలో జరిగిన బలవంతపు భూసేకరణపైనా కూడా లోకేష్ స్పందించాల్సిన అవసరముంది. ఇద్దరి మధ్యలో రైతులు నష్టపోయారు. వారిని ఆదుకునే చర్యలు ఇప్పటికైనా ప్రభుత్వం చేపట్టాలి. రైతులతో చర్చించి న్యాయమైన పరిహారం అందించాలి.

వి.రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి అనంతపురం.

కోర్టులో ఉన్నందునే పరిహారం అందలేదు

పోతులనాగేపల్లి పరిధిలో 90 మంది నిర్వాసిత రైతులుంటే 38 మంది రైతులకు పరిహారం అందింది. తక్కిన వారు అంగీకరించక కోర్టుకు కెళ్లారు. దీంతో వారికివ్వలేకపోయాం. పరిహారం మొత్తం ధర్మవరం ఆర్డీవో వద్దనే ఉంది. ఈ వివాదం పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. తప్పుడు సమాచారాన్ని ప్రచురించడాన్ని ప్రసారం చేయడాన్ని ఖండిస్తున్నట్టు కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు.

అరుణ్‌బాబు సత్యసాయి జిల్లా కలెక్టర్.

ఆగని ఇసుక దోపిడీ

◆ జయమంగళ రీచ్ నుంచి యథేచ్ఛగా తరలింపు

◆ అధికారుల ఆదేశాలు బేఖాతార్ చేసిన జెపి కన్‌స్ట్రక్షన్స్

◆ అంచనాకు మించి ఇసుక తరలింపు

పరిగి మండల కేంద్రంలోని జయమంగళ నది ప్రాంతంలోని రీచ్ నుంచి ఇసుక అక్రమ తరలింపు యథేచ్ఛగా కొసాగుతోంది. ఇసుక తరలింపునకు అనుమతి తీసుకున్న యాజమాన్యానికి కోటా పూర్తయినా ఇసుక దోపిడీని మాత్రం ఆపడం లేదు. అధికారుల ఆదేశాలను సైతం పట్టించుకోకుండా సదరు యాజమాన్యం ఇసుకను తరలించుకుపోతోంది. కళ్లేదుటే ఈ దోపిడీ జరుగుతున్నా అధికారులు చేష్టలుడిగి చూసే పరిస్థితి ఉండడం గమనార్హం.

ప్రజాశక్తి-పరిగి

పరిగి మండల కేంద్రంలోని జయమంగలి నది ప్రాంతంలో ఇసుక రీచ్‌ను ఇటీవల ఏర్పాటు చేశారు. గత మూడు రోజుల క్రితమే జెపి కన్‌స్ట్రక్షన్‌కు ఇచ్చిన అనుమతులతో పాటు అంచనా వేసిన 3.9 హెక్టర్ల పరిధి ఇసుకను తరలించారు. అనుమతి ఇచ్చిన ఇసుక తరలించడంతో మండల రెవెన్యూ అధికారులు ఇసుక తరలింపు నిలిపేయాలని యాజమాన్యానికి ఆదేశాలు ఇచ్చారు. దీనిని సదరు కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం పెడచెవిన పెట్టినట్లు తెలుస్తోంది. తమకు ఇసుక డిమాండ్ ఎక్కువ ఉందని, నిలుపుదల చేయడం కుదరదని అధికారులను చెప్పినట్లు సమాచారం. అధికారుల ఆదేశాలను సైతం బేఖాతారు చేస్తూ జెపి కన్‌స్ట్రక్షన్స్ యథేచ్ఛగా రీచ్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తోంది. దీనిపై స్థానిక రైతులు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నోఏళ్ల తర్వాత భూగర్భ జలాలు పెరిగాయని ఆనందిస్తున్న తరుణంలో ఇలా నది నుంచి ఇసుక తరలిపోతే నీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. అధికార పార్టీ నాయకులు కొందరు జెపి కన్‌స్ట్రక్షన్స్‌తో కుమ్మక్కై ఇసుక అక్రమ తరలింపునకు సహకరిస్తున్నారనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. ఇప్పటికే ఇసుక అక్రమ రవాణాపై వామపక్ష పార్టీలతో పాటు ప్రతిపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాయి. అయినా అధికార పార్టీ నేతల సాయంతో ఇసుక అక్రమ తరలింపు కొనసాగుతూనే ఉంది. ఇదిలానే కొనసాగితే తాగడానికి, వ్యవసాయానికి నీరు సమృద్ధిగా దొరకక ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇసుక రీచ్ నిలుపుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక నిల్వల పెంపునకు చర్యలు

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

జిల్లాలో ప్రజా అవసరాలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా కొరత రాకుండా అన్ని చర్యలూ చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు, ప్రభుత్వ పనుల నిర్మాణాలకు సరిపడా ఇసుక నిల్వ ఉంచాలని సూచించారు. జిల్లాలోని బత్తలపల్లి మండల పరిధిలోని దంపెట్ల, తాడిమర్రి మండల పరిధిలోని సిసి రేవుల్లో ఇసుక రీచ్‌లను కొత్తగా గుర్తించడంతో వాటిని కమిటీ సమావేశంలో ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో ఆయా శాఖల ద్వారా అనుమతి పత్రాలు వచ్చిన వెంటనే ఈ రీచ్‌లు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టవలసిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదనపు ఎస్పీ రామకష్ణ ప్రసాద్, గనుల శాఖ డిడి నాగయ్య, ఏడి రామకష్ణ, ఇరిగేషన్ ఈఈ ప్రతాప్, ఆర్‌కె ప్రసాద్, డిపిఒ విజయ్ కుమార్, ఆర్‌డబ్ల్యు ఎస్ఎస్‌సి రషీద్ ఖాన్, ఎంవిఐ శివ శంకర్ పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

బ్యాంకర్లు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించినప్పుడే అభివృద్ధి సాధ్యమని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె. రత్నాకర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రశాంతిగ్రామ్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నూతన బ్రాంచిని రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టపర్తిలో ఇప్పటికే చాలా బ్యాంకులు ఏర్పడ్డాయని, నూతనంగా మరో బ్యాంకు రావడం సంతోషకరమని అన్నారు. అనంతరం బ్యాంకు జనరల్ మేనేజరు రజిని కుమార్ మాట్లాడుతూ తమ బ్యాంకుకు దేశంలో 2200 బ్రాంచులు ఉన్నాయని రూ. 4.10 లక్షల కోట్లు టర్నోవర్ జరుగుతోందని అన్నారు. ఎపిలో 34 బ్రాంచులు ఉన్నాయన్నారు. రైతులు, వ్యాపారులు ఇతర అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలు అందించి అందరి మన్ననలను పొందుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ సతీష్, వైసిపి నాయకులు లోచర్ల విజయభాస్కర్ రెడ్డి, కొండసాని సురేష్ రెడ్డి, పుడా ఛైర్‌పర్సన్ భర్త గంగాద్రి, సింగిల్ విండో అధ్యక్షులు రుషికేశవరెడ్డితో పాటు పలువురు రైతులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు భూమిపూజ

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం, కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ, సున్నపుకుంట తండాలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలకు ఎమ్మెల్యే సిద్ధారెడ్డి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న లేఔట్లను ఏర్పాటు చేసి ఇంటి పట్టాలను అందజేయడంతో పాటు గృహ నిర్మాణాలను చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, హౌసింగ్ డీఈ, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, వైస్ ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

త్వరతగతిన 'నాడు-నేడు' పనులు

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

మండలంలోని ఆయా పాఠశాలల్లో చేపట్టిన నాడునేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డిఇఇ రంగనాథరావు సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ అభివద్ధి కార్యాలయంలో గురువారం మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలకు, సచివాలయ, ఎంఆర్‌సి సిబ్బందికి ఎంపిడిఒ పోలప్ప, ఎంఇఒ ఖాదర్ వలి బాషా అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి హాజరైన డిఇఇ రంగనాధరావు మాట్లాడుతూ నాడు -నేడు ద్విదశ నిర్మాణం పనులను వేగవంతం చేయాలని, దశల వారిగా ఎప్పటికికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నాడు,నేడు పథకం ద్వారా చేపట్టిన పనుల వివరాలు పూర్తి స్థాయిలో నివేదికలు సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు.

మోడల్ ఎంసెట్ విజయవంతం

ప్రజాశక్తి - హిందూపురం

మోడల్ ఎంసెట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రెండవ రోజు గురువారం పట్టణంలోని సువర్ణ భారతి జూనియర్ కళాశాలలో నిర్వహించిన మోడల్ ఎంసెట్ విజయవంతం అయింది. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, కళాశాల ఎఒ అనీల్, అధ్యాపకులు మోడల్ ఎంసెట్ ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అనీల్ మాట్లాడుతు ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సమస్యలపై పోరాటాలను చేయడంతో పాటు పరీక్షల్లో ఉన్న భయాన్ని పోగొట్టడానికి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, హర్ష, మహేష్, భగత్, వినోద్, నిహాల్, అబి, రమేష్, హర్ష, నాగేంద్ర, నవీన్, లిఖిత్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేకహోదా కోసం వికలాంగుడి పోరు

ప్రజాశక్తి-హిందూపురం

మూడు చక్రాల సైకిల్ యాత్రలో వికలాంగుడు ప్రసాద్‌తో చైర్‌పర్సన్ ఇంద్రజ

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విశాఖపట్నంకు రైల్వేజోన్ కోసం మూడు చక్రాల సైకిల్ యాత్ర చేపట్టినట్టు వికలాంగుడు ప్రసాద్ తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం శ్రీకాకుళం జిల్లా కంచలి మండలం బురగాం గ్రామానికి చెందిన తాను 2018లోనే ఇచ్చాపురం నుండి ఉమ్మడి జిల్లా అనంతపురానికి మూడు చక్రాల సైకిల్ యాత్రను ప్రారంభించానన్నారు. అయితే కరోనా కారణంగా 2020లో నంద్యాల వరకు యాత్ర నిర్వహించి నిలిపివేశానన్నారు. ఆ తరువాత తిరిగి ఈ ఏడాది జనవరి మొదటి వారం నుండి సైకిల్ యాత్రను ప్రారంభించినట్లు చెప్పారు. 23 జిల్లాలోనూ ఈ సైకిల్ యాత్ర నిర్వహించి ఢిల్లీకి వెళ్తానన్నారు. అక్కడ 7 రోజుల పాటు సైకిల్ ర్యాలీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. తాను నిర్వహించిన ఈ యాత్రలో జిల్లాలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రతి నియోజకవర్గంలో రెవిన్యూ, పోలీసులు తనకు సహకరిస్తున్నారని ఆయన తెలిపారు. గురువారం హిందూపురానికి చేరుకున్నానని ఇక్కడ అధికారులను, ప్రజా ప్రతినిధులను కలిసి ఇక్కడి నుంచి పుట్టపర్తి వరకు వెళతానని చెప్పారు. ఇక్కడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రసాద్‌ను అభినందించి, ఆర్థిక సాయాన్ని అందించారు. వీరితో పాటు మున్సిపల్ ఉద్యోగులు ఆర్థిక సాయం అందజేశారు.

జగనన్న కాలనీల పేరుతో మోసం : సిపిఎం

ప్రజాశక్తి - నల్లచెరువు

జగనన్న కాలనీల పేరుతో సామాన్య ప్రజలకు ప్రభుత్వం మోసం చేస్తోందని సిపిఎం నాయకులు విమర్శించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు జగనన్న కాలనీల పేరుతో ఇంటి పట్టాలను మంజూరు చేసి ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. జగనన్న కాలనీలు నివాసయోగ్యం కానిచోట చెరువు మరవల వద్ద, వాగుల వద్ద, శ్మశానాల వద్ద ఏర్పాటు చేశారన్నారు. అక్కడికి వెళ్లి ఇల్లు కట్టుకోవడానికి ప్రజలు ఎవరు సిద్ధంగా లేరని, అనువుగాని చోట పట్టాలు మంజూరు చేయడం అన్యాయమని అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో 2022 ఫిబ్రవరి నెలలో కే.పూలకుంట రోడ్డులో ఉన్న సుమారు 7. 13 ఎకరాల ప్రభుత్వ భూమి అందరికీ అందుబాటులో ఉంటుందని పట్టాలు మంజూరు చేయాలని కోరామన్నారు. భవన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులకు, నిరుపేద కూలీలు దాదాపు 194 మంది అర్హులు ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకోగా వాటిలో కేవలం 48 మంది మాత్రమే అర్హులని అధికారులు నిర్ధారించారని అన్నారు, వీరికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా ఇల్లు కట్టిస్తామని ప్రగల్భాలు పలికి ఇంతవరకు ఒక్క ఇంటిని కూడా నిర్మించలేదన్నారు. ప్రజలను మభ్య పెట్టడానికే ప్రభుత్వం కాలనీలపేరుతో కాలం వెళ్లబుచ్చుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లేకపోతే ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం శ్రీరాములు, భవన నిర్మాణ సంఘం సదాశివ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులను తక్షణం ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

మండల పరిధిలోని పోతులనాగేపల్లి లేఅవుట్లో ఇళ్లస్థలాల కోసం భూములిచ్చిన నిర్వాసితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఎం నాయకులు పోలా రామాంజినేయులు, ఎస్‌హెచ్ బాషా డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఐదేళ్లక్రితం టీడీపీ హాయంలో భూములిచ్చినప్పటి నుండి రైతులకు ఇంతవరకు పరిహారం అందలేదన్నారు. గతంలో కూడా సీపీఎం ఆధ్వర్యంలో రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని రైతుసంఘాల నాయకులు ఆం దోళన చేశారన్నారు. మార్కెట్ ధరకి డబ్బులు చెల్లించాలని నిబంధనలు ఉన్నప్పటికి ప్రతిపక్షంలో ఉన్న అప్పటి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తమ ప్రభుత్వం వస్తే ఎకరా రూ.20 లక్షలు ఇప్పిస్తానని హామీ ఇచ్చిన వారిచేత కోర్టులో దావా వేయించారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఎమ్మెల్యే ఇప్పించకపోవడం దారుణమన్నారు. పైగా ప్రస్తుతం కోర్టులో ఉంది ఇప్పుడు అంత మొత్తం ఇవ్వడానికి కాదని ఎమ్మెల్యే పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.25 లక్షలతోపాటు ప్రత్యేకంగా భూమి వసతి కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కలెక్టర్, ఆర్డీఓ, ఇతర అధికారులు వెంటనే రైతులకు న్యాయపరమైన నష్టపరిహారం చెల్లించడానికి కోర్టులో ఉన్న కేసుల్నిపరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, ఆయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల పరిధిలోని దొరిగిల్లు గ్రామంలో రూ. 2.8 కోట్లతో వ్యయంతో చేపట్టిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు ఎమ్మెలేయ కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరిగిల్లు పరిసర ప్రాంతాల వ్యవసాయ, గృహ అవసరాల విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి ప్రభుత్వం నూతన సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. అదేవిధంగా త్వరలో మంగళమడక నూతన సబ్ స్టేషన్ ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో దొరిగిల్లు సర్పంచి అంకె రాణి అంకె చంద్ర, ఇందుకూరు నారాయణరెడ్డి, జెడ్పీటీసీ తిరుమల సేవే నాయక్‌తో పాటు వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మవరం టౌన్ :పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణ కార్యక్రమంతో గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. రాత్రి ధ్వజారోహణ కార్యక్రమంలో భాగంగా అంకురార్పణ, నవకుంభస్థాపన, గరుడప్రతిష్ట కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, ఈవో వెంకటేశులు, డైరెక్టర్లు పొరాళ్లపద్మావతి, జగ్గాజయలక్ష్మీ, సత్రశాల సత్యనారాయణ, మహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

భావన ధరణి దుర్నాజ్ అనుషా సింధూజా జ్యోతిక కళ్యాణి మాధురి మానస రుమాన యశశ్రీ

ఇంటర్ ఫలితాల్లో ప్రయివేటు కళాశాలల సత్తా

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ప్రైవేటు కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. పట్టణంలోని శ్రీవాసవీ జూనియర్ కళాశాలలో ద్వితియసంవత్సరం ఎంపీసీ గ్రూపులో సింధుజ 987, ధరణి 985, మేఘన 985, నాగేశ్వరి 984, తనూష 984, భావన 978, చందనసాయి 977, సాయివర్షిణి 975, రజిని 974, జాహ్నవి 974, లిఖిత 972, ప్రనూష 971, అమతవర్షిణి 970 మార్కులతో ప్రతిభ కనబరిచారు. ఇక ద్వితియసంవత్సరం బైపీసీలో రుమాన 983, దివ్యశ్రీ 970, ఎంఇసిలో లక్ష్మీప్రసన్న 962, సిరియాదవ్ 968, నాగహర్షిత 966, సీఈసీలో మానస 962. అఖిల 955 మార్కులతో ప్రతిభకనబరిచారు. అదేవిధంగా ప్రథమ సంవత్సరం ఎంపీసీలో మాధురి 464, భావన 463, యషశ్రీ 463, శ్రీలేఖ 463, అనూష 463, కళ్యాణి 463, సుప్రియ 462, శర్వాణి470, అప్పు 462, ప్రణతి 462, మౌనిక 461, హమీద 461, శ్రీహర్షిత 461, ఉజ్మ సిద్ధిక 461, ప్రతిభ 460 మార్కులు సాధించారు.

మొదటి సంవత్సరం బైపీసీలో దుర్నాజ్ 432, సారాసాదియా 429, లిఖిత 420, సీఈసీలో జ్యోతిక 480, దేవసేన 468, సాధించారని కళాశాల డైరెక్టర్లు ఈశ్వరయ్య, సోమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శివశంకర్ తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను డైరెక్టర్ అభినందించారు. అదేవిధంగా కళాశాలలో గురువారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ఇక సాయికృప జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ ధనుంజయ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఈ. నారాయణస్వామి 978, పృథ్వీ 977, సంతోష్ 975, ఫర్దినాన్ 967, బైపీసీ విభాగంలో మోహనకుమార్ 969, సీఈసీలో త్రిలోక్‌నాథ్ 842 మార్కులతో విజయకేతనం ఎగురవేశారన్నారు. అదేవిధంగా మొదటి సంవత్సరం ఎంపీసీలో 461, తేజేశ్వర్ 158, గోపీచంద్ 448, కృష్ణకౌశిక్ 416, వికాస్ 446, షాషావలి 437, హరిత్ 492, సిఇసిలో సంతోష్‌కుమార్ 477, రూప్ చంద్ 419 మార్కులు సాధించి సతాచాటారన్నారు. దీంతో ప్రతిభ కనబరచిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ క్రిష్టతేజ, డైరక్టర్లు భగవంతరెడ్డి, పురుషోత్తంరెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు రామాంజినేయులు, చంద్రశేఖర్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోరంట్ల : మండలంలోని పాలసముద్రం పంచాయతీ మిషన్ తండా వద్ద జాతీయ రహదారిలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుగొండకు చెందిన రఫిక్ (50) అనే వ్యక్తి మృతిచెందాడు. సిఐ సుబ్బరాయుడు తెలిపిన వివరాలు... పెనుకొండకు చెందిన రఫిక్ గుడిబండ పరిధిలోని ఉర్లకొండలో మైండ్స్ మేనేజర్‌గా పనిచేస్తుండేవాడు. పని ముగించుకొని పెనుగొండకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా మిషన్ తండా వద్ద ద్విచక్ర వాహనంలో వెళుతున్న రఫీకును కంట్రైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రఫిక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

బుక్కపట్నం : మండల పరిధిలోని జానకంపల్లిలో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. గ్రామ సమీపంలోని మామిడి తోటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో గురువారం తమ సిబ్బందితో కలిసి దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 13, 960 రూపాయల నగదును స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పశుగ్రాసం దగ్ధం

కొత్తచెరువు : కొత్త చెరువులోనే బుక్కపట్నం రోడ్డులో సంగమేశ్వరం ఆలయం సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో గడ్డివాము దగ్ధమైంది. గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అది పూర్తిగా దగ్ధమైంది. కెంపుల లక్ష్మి అనే మహిళారైతు పాడి గేదెలకు అక్కడ వరిగడ్డి 15 బండ్లు వాము వేసి పశువుల మేత కోసం ఉపయోగించుకుంటోంద. అయితే గురువారం సాయంకాలం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గడ్డి అగ్నికి ఆహుతి అయింది.

టిడిపిలో పలువురు చేరిక

రామగిరి : మండల పరిధిలోనికొండాపురం పంచాయతీ, రెడ్డివారి పల్లి గ్రామానికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. గ్రామానిక చెందిన నరసింహలు, నాగరాజు, మద్దిలేటి తదితరులు రామాంజి రెడ్డి, మహదేవ, తెలివి నాగరాజు,గోపాల్ శ్రీరామ్ తదితరుల సమక్షంలో వైసిపి నుంచి సీనియర్ నాయకులు రామ్మూర్తి నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో నాయకుల దుబ్బార్లపల్లి వెంకటేష్, ఓబులపతి, కొత్తగేరి నరేంద్ర తదితరలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించాలి : వ్యకాసం

పెనుకొండ : ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మండలంలోని కొండంపల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు చెర్లోపల్లి కుంటలో చేస్తున్న పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాల కాలంలో బిజెపి ప్రభుత్వం కూలీలకు వ్యతిరేకమైన విధానాలను అవలంబిస్తూ ఉపాధి హామీ పథకానికి నిధులకు ప్రతి సంవత్సరం బడ్జెట్లో కోతలు పెడుతోందన్నారు. కూలీలు ఐక్యంగా కలిసి పోరాడి ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలన్నారు. అందుకోసం మే 22 వ తేదీన పుట్టపర్తిలోని పీడీ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సప్తగిరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

ఇంటర్ ఫలితాల్లో అసాధారణ విద్యార్థులతో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు సప్తగిరిఇ కళాశాల ప్రిన్సిపాల్ మంజునాథ్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్ ఫలితాలలో సప్తగిరి కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చినరన్నారు. సెకండ్ ఇయర్ బైపిసి విభాగంలో సంపద 974, సీఈసీ విభాగంలో మనోహరి 964 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ విభాగానికి చెందిన సంజన సాయి తేజ 429 మార్కులు సాధించారని తెలిపారు. ఈ విద్యార్థులను డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శివ శంకర్ రెడ్డి, పరిపాలన అధికారి గంగిరెడ్డి, ఎంబిఎకళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి అభినందించారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు

కనగానపల్లిలో 54 శాతం ఉత్తీర్ణత : ఇంటర్మీడియట్ ఫలితాల్లో కనగానపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు 54 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ రవికిరణ్ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 41 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 22 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంపిసిలో జాహ్నవి 903, బైపిసిలో యశ్వంతి 890, సిఇసిలో అంజలి 863 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచినట్లు ఆయన తెలిపారు.

ధర్మవరం విద్యార్థినికి ప్రథమస్థానం : ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత నాయకుడు పరిశేకిరణ్ కుమార్తె పరిశేమైథిలి ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విద్యార్థిని అనంతపురం శ్రీచైతన్య స్కూల్లో 10వతరగతి చదివి ప్రథమస్థానంలో నిలిచిందని ఆమె తండ్రి పరిశేకిరణ్ తెలిపారు. ప్రస్తుతం విజయవాడలోని చైతన్యకళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో 464 మార్కులు సాధించిందని చెప్పారు.

లేపాక్షి విద్యార్థుల ప్రతిభ : ఇంటర్ ఫలితాల్లో లేపాక్షి విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. ప్రభుత్వం జూనియర్ కళాశాల లో ఇంటర్ మొదటి సంవత్సరం లో 59మందికి గాను 16మంది, రెండో సంవత్సరంలో 49 మందికి గాను 9మంది ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా కస్తూరి బా కళాశాల లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 15మందికి గాను ముగ్గురు, రెండో సంవత్సరంలో 35మందికి గాను 16మంది ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా మహాత్మా జ్యోతి బాపూలే కళాశాల లో మొదటి సంవత్సరంలో 121మందికి గాను 93మంది, రెండో సంవత్సరం లో 112మందికి గాను వందమంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్స్ నీలిమ, శ్రీనివాసులు, ప్రసాద్ తెలిపారు.

సికెపల్లి విద్యార్థినికి రాష్ట్రర్యాంక్ : మండలంలోని గాలి మోహన్ రెడ్డి కూతురు జాహ్నవి అనే విద్యార్థిని ఇంటర్ ఫలితాల్లో స్టేట్ ర్యాంక్ సాధించింది. జాహ్నవి నారాయణ జూనియర్ కాలేజ్ బీటీసీ క్యాంపస్‌లో చదువుతోంది. ఈమె ఇంటర్ ఫలితాల్లో 989 మార్కులు సాధించి స్టేట్ ర్యాంకును దక్కించుకుంది. ప్రతిభా విద్యార్థి జాహ్నవిని ఈసందర్భంగా గ్రామస్తులు అభినందించారు.

టేకులోడు గురుకులం టాప్ : ఇంటర్ ఫలితాలలో చిలమత్తూరు చిలమత్తూరు టేకులోడు గురుకుల పాఠశాల విద్యార్థులు మెరుగైన పలితాలను సాధంచి మండలంలో మొదటి స్థానంలో నిలిచారు. గవర్నమెంట్ జూనియర్ కాలేజీ విద్యార్థులు రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. టేకులోడు గురుకులంలో మొదట సంవత్సరం విద్యార్థులు 95 శాతం, ద్వితియ సంవత్సరం విద్యార్థులు 85 శాతం ఉత్తీర్ణత సాధించారు. గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 74 శాతం, ద్వితీయ సంవత్సరం 60 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రతిభా విద్యార్థులను ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రమణారెడ్డి అభినందించారు.

జగరాజుపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ : ఇంటర్ మొదటి ద్వితీయ సంవత్సర ఫలితాల్లో జగరాజు పల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చినట్లు ప్రిన్సిపల్ రమేష్ బాబు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 61 మంది విద్యార్థులుండగా 37 మంది ఉత్తీర్ణత సాధించారు. సీఈసీలో శరణ్య 453, శిరీష 431, ఎంపిసిలో పుష్పలత413, బైపిసిలో ఝాన్సీ 376. మార్కులు సాధించారన్నారు. ఇంటర్ రెండవ సంవత్సరంలో 49 మంది విద్యార్థులుండగా 29 మంది ఉత్తీర్ణత సాధించారు. బైపిసిలో అనూష 802, ఎంపీసీలో కిరణ్ కౌశిక్ 776, సిసి తేజస్విని 768, సీఈసీలో చందు 746 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది అభినందించారు.

రొద్దం విద్యార్థుల ఉత్తమ ఫలితాలు : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ పలితాల్లో ప్రతిభ కనబరిచారు. ద్వితీయ సంవత్సరంలో 71 మందికి 38 మంది పాసయ్యారు. అదేవిధంగా మొదటి సంవత్సరం 56 మందికి గాను 26 మంది ప్రతిభ కనపరిచారు.

కెజిబివి విద్యార్థుల ప్రతిభ : మండల కేంద్రంలో ఉన్న కెజిబివి విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో టి. ప్రశాంతి 927, ఏ. నందిని 884, వి. నాగేశ్వరి (861 మార్కులు సాధించారు.

గుడిబండ గురుకులం విద్యార్థుల విజయ దుందుభి : గుడిబండ మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ ద్వితీయ సంవత్సరం పరీక్షల ఫలితాల్లో విజయదుందుభి మోగించారు. ప్రథమ సంవత్సరం 95 శాతం, ద్వితీయ సంవత్సరం 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 105 మంది విద్యార్థులకు 100 మంది, ద్వితీయ సంవత్సరంలో 85 మంది విద్యార్థులకు గాను 84 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఇంటర్ ఫలితాల్లో మంగళకర విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో మంగళకర విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని మంగళకర విద్యాసంస్థల కరస్పాండెంట్ సురేష్ కుమార్ తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం 392 మంది విద్యార్థులు ఉండగా 332 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. మొదటి సంవత్సరంలో 298 మంది విద్యార్థులకు గాను 243 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో డి ప్రశాంతి 974, ఎం రవీంద్ర 962, బైపిసిలో జి యశోద 967, సౌమ్య 966, సీనియర్ ఎన్ఎంలో విశాఖ బురాని 948, కరిష్మా 925 మార్కులు సాధించారన్నారు. సీనియర్ సిఇసిలో బి అశ్విని 895, ఏ అనుష్క పాండే 884 మార్కులు సాధించినట్లు చెప్పారు. సీనియర్ సిఇసి తెలుగు మీడియంలో సి వివేకానంద రెడ్డి 741 మార్కులు సాధించినట్లు వివరించారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో షేక్షావలి 455, శ్రీవిద్య 451, బైపిసిలో కే పల్లవి 424, ఫర్జానా 416 మార్కులు సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మంగళకర విద్యాసంస్థల కరస్పాండెంట్ సురేష్ కుమార్, ఎఒ జయ చంద్రారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ 2022- 23 విద్యా సంవత్సరంలో మంగళకర విద్యార్థులు చూపిన ప్రతిభ అభినందనీయమన్నారు. ఇందుకు కారణం సంస్థలో ఉన్న విద్యా విధానం, క్రమశిక్షణ అని అన్నారు.

విజయచిహ్నం చూపుతున్న మంగళకర విద్యార్థులు, అధ్యాపకులు

టిడిపిది పచ్చటి పంట పొలాలను నాశనం చేసిన చరిత్ర

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పేదలకు ఇళ్ల పట్టాల పేరుతో ఎన్నికలకు ముందు హడావుడిగా కనీసం లే అవుట్ కూడా వేయకుండా రైతుల గోడు వినకుండా తగినంత పరిహారం ఇవ్వకుండా బలవంతంగా భూసేకరణ చేపట్టిన చరిత్ర గత టీడీపీ ప్రభుత్వానిది అని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి విమర్శించారు. రైతులందరు ప్రభుత్వానికి వ్యతిరేఖంగా పరిహారం పెంచాలని అందోళనలు చేపడితే పట్టించుకోకుండా పోలీసులతో దౌర్జన్యానికి దింపి తుంపర్తి, పోతుల నాగేపల్లి రైతులకు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిఎం ధర్మవరం మీదుగా పుట్టపర్తికి వెళ్లే క్రమంలో ఎంతో కట్టుదిట్టమైన సెక్యూరిటీ నడుమ వెళ్లారన్నారు. మార్గమధ్యలో తుంపర్తి రైతులు నిరసన చేస్తుంటే సీఎం వైఎస్ జగన్ పట్టించుకోవడం లేదని చెప్పడం దారుణమన్నారు. కావాలనే రైతుల్ని రెచ్చగొట్టి రాజకీయం చేసి లబ్ధిపొందాలని చూస్తే సహించేదిలేదని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలు తెలుసుకుని 2019లో పరిహారం పెంచాలని అప్పటి మంత్రి పిల్లి సుభాస్ చంద్రబోస్, సీసీఎల్ఎకు వివరించామన్నారు. బాధిత రైతులకు గత టీడీపీ ప్రభుత్వం పరిహారం రూ.5లక్షలు కోర్టులో జమ చేసిందనిఒకసారి ఆర్డర్ అయిన రైతులకు పరిహారం పెంపు సాధ్యం కాదని చెప్పారన్నారు.బాధిత రైతులకు పరిహారం పెంపు సాధ్యం కాదని తెలుసుకున్న తర్వాత వారికి ఏదో ఒక విధంగా న్యాయం చేయాలని తాము ధర్మవరం- పుట్టపర్తి ప్రధాన రహదారి వద్ద ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లో ఒక్కో రైతుకు 5సెంట్లు చొప్పున ఇచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇందుకు సంబంధించి రోడ్డుకు అనుకుని 8 ఎకరాలను రిజర్వ్ చేశామని వివరించారు. ఈప్రతిపాదనను రైతులకు చెప్పామనిచాలా మంది రైతులు స్థలం తీసుకునేందుకు అంగీకరించారని అన్నారు. ఈనేపథ్యంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు రైతులను రెచ్చగొట్టడం దారుణమన్నారు. తనని రైతులు కలసి ఉంటే నేరుగా సీఎం దగ్గరకే తీసుకువెళ్లేవాడినని కనీసం తనకు సమాచారం ఇవ్వకుండా సీఎం పట్టించుకోవడం లేదని అభాండాలు వేయడం దారుణమని అన్నారు. రైతులకు తన వంతు సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన తెలిపారు. పార్టీలు చూడకుండా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన భూసేకరణలో రేగాటిపల్లి రైతులకు ఎకరాకు రూ.25లక్షల చొప్పున పరిహారం అందించిన విషయాన్ని గుర్తు చేశారు.

ఎంపిసిలో 'నారాయణ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం టౌన్

ఇంటర్ పరీక్షా ఫలితాల్లో నారాయణ కళాశాలకు చెందిన ఎంపిసి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్ పేర్కొన్నారు. ఎంపిసి గ్రూప్‌లో 25 మంది విద్యార్థులు 450 మార్కులకు పైగా, సీనియర్ ఎంపిసిలో 20 మంది విద్యార్థులు 970 మార్కులకు పైగా సాధించారన్నారు. అత్యధిక ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్‌తో, అధ్యాపకులు, ఎజిఎం కేవవరెడ్డి అభినందించారు.

విజయకేతనం చూపుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

'స్పేస్' కళాశాల విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఇంటర్ ఫలితాలలో స్థానిక స్పేస్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. కదిరి రూరల్ కుమ్మరవాండ్లపల్లి లోని స్పేస్ కళాశాలకు చెందిన ద్వితియ సంవత్సరం ఎంపీసీలో ఎస్ ఫర్హాద్ 974, బైపిసిలో యశస్విని 968, జిగిని 960, సిఇసిలో సాయి వజ్రేశ్వరి 960 మార్కులతో ప్రతిభ కనపర్చారు. సిఇసిలో ఎస్ .సీమ 968 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. 11 మంది విద్యార్థులు 950 పైన మార్కులు, 21 విద్యార్థులు 900 పైన మార్కులు సాధించారు. అలాగే ప్రథమ సంవత్సరం ఎంపీసీలో పి నాసియా 459 మార్కులు సాధించి ఆరవ ర్యాంకుగా నిలిచింది. రుమానా కౌసర్ బైపీసీ లో 420, ఎస్ యశ్వంత్ కుమార్ 401, సీఈసీలో ఎస్ కిరణ్ కుమార్ 469 మార్కులు సాధించారు. అలాగే పది మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ చెప్పారు. ఇంతటి ఘనవిజయం సాధించినందుకు విద్యార్థినీ విద్యార్థులను ఆయన అభినందించారు.

సువర్ణభారతి విద్యార్థుల ఆల్‌టైమ్ రికార్డు

ప్రజాశక్తి-హిందూపురం

ఇంటర్ జూనియర్, సీనియర్ పరీక్షా ఫలితాలలో స్థానిక సువర్ణ భారతి కళశాల విద్యార్థులు ఆల్‌టైమ్ రికార్డు సృష్టించినట్లు ప్రిన్సిపల్ నీలకంఠారెడ్డి, ఎఒ అనీల్‌కుమార్ తెలిపారు. సీనియర్ ఎంపిసి గ్రూపులో పావని, వై. స్నేహలత 987 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానం సాధించారన్నారు. అదే విధంగా నందిని 982, గణేష్ 978, లిఖిత 974, సాధించారన్నారు. మొత్తం 106 మంది విద్యార్థులు ఉంటే ఇందులో 22 మంది విద్యార్థులు 900 మార్కులకు పైగా సాధించారన్నారు. 25 మంది విద్యార్థులు 800 మార్కులకు పైగా సాధించారన్నారు. మరో 14 మంది విద్యార్థులు 700 మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. బైపిసిలో బి.అఫీయా బాను 972, రేష్మా 966 మార్కులు సాధించారన్నారు. అదే విధంగా బైపిసి గ్రూపులో 78 మంది విద్యార్థులు ఉంటే ఇందులో 18 మంది విద్యార్థులు 900 మార్కులకు పైగా, 28 మంది విద్యార్థులు 800 మార్కులకు పైగా, 11 మంది 700 మార్కులకు పైగా సాధించారన్నారు. ఎంఇసిలో శ్రీఖధర్య 964, పవిత్ర 963 మార్కులు సాధించినట్లు చెప్పారు. మొత్తం 30 మంది విద్యార్థులకు గాను ఏడుగురు 900 మార్కులు, మరో ఏడుగురు 800, మిగిలిన వారు 700 మార్కులకు పైగా సాధించారన్నారు. సిఇసిలో సాదియా 926, రంజిత 925 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఎంపిసిలో పల్లవి 457, అఖిల్-456, మార్కులు సాధించినట్లు వివరించారు. మొత్తం 95 మంది విద్యార్థులు ఉంటే 470 మార్కులకు గాను 32 మంది విద్యార్థులు 400 మార్కులకు పైగా, 29 మంది విద్యార్థులు 350 మార్కులకు పైగా సాధించారన్నారు. బైపిసిలో అఫ్రీన్ 429, పి.ఫిర్దోస్, మధుమతి 427 మార్కులు సాధించారు. మొత్తం 78 మంది విద్యార్థులకు గాను 16 మంది 400 మార్కులకు పైగా, మరో 13 మంది 350 మార్కులకు పైగా సాధించారన్నారు. ఎంఇసిలో గోయల్ ఉజ్వల్ రాజేష్ 473, జీఎన్. పావని 466, సిఇసిలో ఆలీయా 480, మార్కులు సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు ఎఒ అనిల్, అధ్యాపకులు అభినందించారు.

In the Court of the Senior Civil Judge & J.M.F.CAT: Pavagada

M.C.No.19/2022

Between:
Saikrishnaveni ...Petitioner
V/s
G.Girisha ...Defendants

Paper Publication

WHEREAS, The Petitioner has filed the above petition, Seeking is she of paper publication Respondent G.Girisha S/o Golla Lakshmaiah, aged about 41 years, R/o Darga Road, Penukonda Town, Sathyasai Dist, Andhra Pradesh Now.

The Matter is set down for issue notice I petition Summons to Respondent who ever got any objection appear in this case same on the date of hearing i.e. 29-05-2023. You one hereby called upon to appear before court at 11 A.M on the said date of hearing either in person or through your counsel ifyou fail to appear this court. The matter will be heard and decided Exparte.

Given under my hand andseal of the court this day of

(By Order of the Court)

R.T. Mallikarjunaiah
Advocate for Plaintiff.

కఠోరమైన దీక్షకు నిదర్శనం భగీరథ మహర్షి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కఠోరమైన దీక్షకు భగీరథ మహర్షి జీవితం నిదర్శనంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని నిర్వహించారు. భగీరథుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎవరైనా కష్టపడి విజయం సాధిస్తే అపర భగీరథుడని కొనియాడతారన్నారు. భగీరథ మహర్షి కఠోర దీక్ష చేసి భువికి గంగను తెప్పించాడని చరిత్ర చెబుతోందన్నారు. అలాంటి మహనీయుల జయంతిని ప్రభుత్వం పండగలా జరుపుకుంటోందన్నారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి మాట్లాడుతూ భావితరాల వారు భగీరథ మహర్షి గురించి తెలుసుకోవాలన్న సదుద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆయన జయంతి నిర్వహించాలని ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహులు, డిఆర్ఒకొండయ్య, డైట్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో వివేకానంద విద్యార్థుల ప్రతిభ

కళ్యాణదుర్గం : ఇంటర్మీడియట్ ఫలితాల్లో వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు ప్రిన్సిపాల్ పద్మావతమ్మ తెలియచేశారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బైపీసీకి గ్రూపులో బి.రేఖ 918/1000, సీఈసీ విద్యార్థి మంజునాథ్ 849/1000 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విద్యార్థి శ్రీనివాసులు 420/470, సీఈసీ విద్యార్థి సాగర్ 444/500 సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల గౌరవసలహాదారు వెంకటేశులు, అధ్యాపకులు సురేష్, శివన్న, బాబా, రమేష్ తదితరులు అభినందించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

బొమ్మనహాల్ : మండలంలోని కొలగానహళ్లి గ్రామంలో వెలసిన కాశీ విశ్వేశ్వర శివాలయం 5వ వార్షికోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త మాజీ ఎంపిపి షణ్ముకయ్య తెలిపారు. భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయం నిర్మాణానికి విరాళం

పెనుకొండ : మండలంలోని ఆడదాకుల పల్లి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ రామలింగేశ్వర ఆలయ నిర్మాణం కోసం కోడిపల్లి గోవర్ధన్ రెడ్డి తమ వంతుగా రూ.1,00111 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు గోవర్ధన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ

పెనుకొండ : పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎం.ఉమా మోహన్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పలు రికార్డులను పరిశీలించి సంతప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాల సంస్థ మాజీ అధ్యక్షులు ఎల్ మోహన్ రెడ్డి, పెనుకొండ గ్రంథాలయ అధికారి కె.మహబూబ్ బాషా, గ్రంథాలయ పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు.

రొద్దం : రొద్దం శాఖా గ్రంథాలయాన్ని గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఉమామోహన్ రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయనికి సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయ పన్ను వసూలుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నాగరాజు, పాఠకులు పాల్గొన్నారు.

పవర్‌లూమ్స్‌పై చేనేత 11 రకాలు నేయరాదు

ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు

మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం పట్టణంలో పవర్లూమ్స్‌లో చేనేతకు సంబంధించిన 11 రకాలను నేయకూడదని, అలా నేస్తే చట్టరీత్యా నేరమని ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు పేర్కొన్నారు. గురువారం స్థానిక సెరిఫెడ్ కార్యాలయంలో పవర్లూమ్స్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ ధర్మవరంలో చాలా మంది చేనేత నుంచి వచ్చి పవర్‌లూమ్స్ మగ్గాలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. పవర్‌లూమ్స్‌లో హ్యాండ్‌లూమ్ 11 రకాలు నేయకుండా చూడాలన్నారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించే బాధ్యత కూడా పవర్లూమ్స్ యజమానులపై ఉందన్నారు. పవర్ లూమ్స్‌లో చేనేత 11రకాలను నేయరాదని కేవలం 50శాతం వరకు జరీ వాడవచ్చన్నారు. గతంలో వారం రోజులపాటు తమకు ఉపాధి ఉండేదని, ప్రస్తుతం మూడురోజులు పనిదొరకదని చేనేత కార్మికులు పేర్కొం టున్నారన్నారు. ఇక నుంచి పవర్లూమ్స్ ప్యూర్ టూప్యూర్ నేస్తే చట్టరీత్యా కేసు నమోదు చేయడమేకాకుండా చీరను కట్ చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడీ అప్పాజీ, సత్యసాయి జిల్లా చేనేత జౌళీశాఖ ఏడీ రమేష్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

మాజీ మంత్రి శంకర నారాయణ

ప్రజాశక్తి -పెనుకొండ

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు నేరుగా అందుతున్నాయని మాజీ మంత్రి శంకర్‌నారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని యర్రమంచి గ్రామ పంచాయతీలోని హరిపురం, కురుబవాండ్లపల్లి గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ బోయ గిరిజమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పార్టీ శ్రేణులు సర్పంచి నాగమూర్తి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వం ద్వారా వారి కుటుంబాలకు అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగమూర్తి, ఎంపిపి గీతా రామ్మోహన్ రెడ్డి, వైస్ ఎంపిపి రామాంజినేయులు, ఎంపిడివో శివశంకరప్ప, వైసిపి మండల కన్వీనర్ నాగలూరు బాబు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం : ఎమ్మెల్యే

గడపగడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

మడకశిర రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. మండల పరిధిలోని ఆర్ అనంతపురం గ్రామంలో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు వైఎస్ జగన్ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సరోజమ్మ నరసింహమూర్తి, కదిరేపల్లి సర్పంచి నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శి లలిత, వైసిపి నాయకులు, పాల్గొన్నారు.

ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లకు బకాయి బిల్లులు తక్షణమే మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షులు ఆర్ఎన్.దివాకర్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ దశల వారీ పోరాట కార్యక్రమంలో భాగంగా గురువారం నగరంలోని పెన్షనర్ల కుటుంబాలను పరామర్శించే కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని హౌసింగ్ బోర్డ్ న్యూ రెవెన్యూ కాలనీలో నివాసం ఉంటున్న పెన్షనర్ మద్దిలేటయ్య రెవెన్యూ శాఖ, తపోవనంలో నివాసం ఉంటున్న శ్రీ నారాయణ, పౌర సరఫరాల శాఖ, బళ్లారి బైపాస్ రోడ్డు సమీపంలో నివసిస్తున్న రమేష్ ఆర్‌టిసి వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ దివాకర్‌రావు మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు, ఆందోళనలు, దశల వారీ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 3 పెండింగ్ డిఏలు, డిఏ అరియర్‌లు, పిఆర్‌సి అరియర్‌లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపి జెఏసి అమరావతి సభ్యులు తోట చెన్నప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక శాఖ నూతన అధికారిని కలిసిన ఆపుస్మా జిల్లా అధ్యక్షుడు

అనంతపురం : అనంతపురం జిల్లా అగ్నిమాపక శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరెడ్డిని గురువారం సాయంత్రం అనంతపురం ప్రయివేటు పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రయివేటు పాఠశాలలకు ఫైర్ డిపార్ట్‌మెంట్ నుంచి ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. కలిసిన వారిలో అనంతపురం ఆపుస్మా స్టేట్ చీఫ్- కోఆర్డినేటర్ కె. రామిరెడ్డి, నాయకులు ఎం. మధుసూదన్ రెడ్డి, జలాల్, నాగరాజు, రామచంద్ర రెడ్డి, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కె.సుబ్బారెడ్డి, నగర కార్యవర్గ సభ్యులు ఎస్.రవిశంకర ప్రసాద్ పాల్గొన్నారు.

బృందావనం పార్టీ ఏర్పాటు

అనంతపురం కలెక్టరేట్ : అన్ని వర్గాల వారికి రాజ్యాధికారాన్ని చేరువ చేయాలన్న సంకల్పంతో బృందావనం పార్టీని ఏర్పాటు చేసినట్లు బృందావనం పార్టీ అధ్యక్షులు వి.రామన్న ప్రకటించారు. గురువారం స్థానిక ఎన్జీవో హోంలో బృందావనం పార్టీ ఆవిర్భావ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రామన్న మాట్లాడుతూ బందావనం పార్టీతోనే బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు రాజ్యాధికార సమానత్వం సాధ్యమని తెలియ జేశారు. ఈ సభలో సాంఘిక ఆర్థిక రాజకీయ విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ గుర్తు కాషాయ రంగు జెండా మధ్యలో శంఖం గుర్తు ఉంటుందన్నారు.

రాయదుర్గం జడ్జి బదిలీ

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో విధులు నిర్వహిస్తున్న జడ్జి లావణ్య కడప జిల్లా కమలాపురం కోర్టుకు బదిలీ అయ్యారు. స్థానిక కోర్టుకు జూనియర్ సివిల్ జడ్జిగా ఇంతవరకు ఎవరిని నియమించలేదు. అనంతపురానికి చెందిన జడ్జికి స్థానిక జూనియర్ సివిల్ జడ్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

తంగేడుకుంట సోత్రియం భూముల పత్రాలు పరిశీలన

పుట్టపర్తి అర్బన్ : ఓడిసి మండలం తంగేడు కుంట కు చెందిన రైతువారి సోత్రియం భూముల ఒరిజినల్ పత్రాల పరిశీలన ప్రక్రియను అధికారులు గురువారం చేపట్టారు. జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు కలెక్టరేట్ లోని స్పందన సమావేశ మందిరంలో 36 మంది దరఖాస్తుదారుల పత్రాలు పరిశీలించారు. అనంతరం రైతు వారి పట్టాల మంజూరు చర్యలు చేపట్టడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఒరిజినల్ పత్రాలు లేని వారు సర్టిఫైడ్ నకలును సబ్ రిజిస్టర్ వారి నుంచి పొంది సమర్పించాల్సి ఉంటుందన్నారు. అర్హులైన రైతులకు పట్టాలు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఓడిసి తహశీల్దార్ శ్రీధర్, కలెక్టరేట్ డిప్యూటీ తహశీల్దార్ నాగార్జున రెడ్డి, పాల్గొన్నారు.

కన్నుల పండువగా గంధం మహోత్సవం

పెనుకొండ : పట్టణంలోని గోనిపేట రోడ్డు నందు గల షేక్ సయ్యద్ షా మహమ్మద్ కమృద్దీన్ అలీ దర్గాలో గంధం మహోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గంధం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన మత పెద్దలు, భక్తులు, పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

గాండ్లపెంట : స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ మాధవరెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. మండలంలో శాంతిభద్రతల గురించి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ భవ్యకిషోర్ రూరల్ సీఐ శంకర్ నాయక్, జమేదార్ రామయ్య, శ్రీనివాసులు, సిబ్బంది నాగరాజు, భాస్కర్, రాజు, బాలాజీ నాయక్, మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి మండల పరిధిలోని యనమలపల్లి భవిత పాఠశాల, గోకులంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు బుధవారం పంపిణీ చేశారు. శ్రీ వాణీ బ్లో సమ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆవిన్, గీత, కేసరి, సహకారంతో తొలుత గోకులంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రితో పాటు సత్యసాయి ఫోటోలు, విభూది అందించారు. అనంతరం యనమలపల్లి భవిత పాఠశాల విద్యార్థులకు సిద్ధార్థ కోచింగ్ సెంటర్ లోని విద్యార్థులకు పండ్ల రసాలు, బిస్కెట్లు ,స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకురాలు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లలిత జవహర్‌లాల్, శ్రీవాణి శ్రీనివాస్ ప్రసాద్, అధ్యాపకులు ఏచూరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.66.27 లక్షలు

కదిరి టౌన్ : ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి సంబంధించిన హుండీల ఆదాయాన్ని ఆలయ అధికారులు గురువారం లెక్కించారు. నగదుగా రూ.66,27,288 లు నగదుగా వచ్చిందని అధికారులు తెలిపారు. అంతేకాకుండా 1102 అమెరికా డాలర్లు వచ్చినట్లు వివరించారు. ఈ మొత్తం 42 రోజులకు వచ్చినట్లు అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమములో ఆలయ కార్యనిర్వాహాధికారితో పాటు ఆలయ కమిటి ఛైర్మెన్ జెరిపిటి గోపాల కృష్ణ, హుండీ పర్యవేక్షణాధికారి నరసింహారాజు, కెనరా బ్యాంకు కదిరి మేనేజర్ శ్రీ.మధుసూదన్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.